# మలుచుకొన్న దారి

**మే**ళ తాళాల ధ్వనులు ముహూర్తాని కింకా కొన్ని నిముషాలున్నాయని సూచిస్తున్నాయి. పెళ్లి పందిరంతటా జనం నిండి ఉన్నారు. పెళ్లికొడుకు తండ్రి సుందరయ్య తలోపని ఒప్ప జెప్పి తాను ప్రశాంతంగా దూరంగా చిరిచాపమీద కూర్చు న్నాడు. పురోహితుడు గబగబా మంత్రాలు వుచ్చరించే స్తున్నాడు.

సుందరయ్యకు తన పెళ్ళి జ్ఞాపకానికి వచ్చింది. ఆ నాటి ఆనందోత్సాహాలు తలచుకొని పులకాంకితుడయ్యాడు. మరు క్షణమే నాటి ఆడంబరాలు తలచుకొని విచారించాడుకూడాను. ఆడంబరంగా జరిగిన ఆ పెళ్ళికి ఎంతో డబ్బు ఖర్చయివుంటుంది. ఇలాగే తన చెల్లెలు పెళ్లి కూడా చేశారు. అయితే యీ అప్పులన్నిటినీ తీర్చవలసిన అవసరం ఆయనకు కలగలేదు. తనే తీర్చాలనే నియమంగానీ ఆ వుద్దేశంగానీ ఆయనకు లేదు. తను బ్రతికి వున్నన్నాళ్ళూ దర్జాగా నలుగురిలో గౌర వంగా గొప్పవాడుగా బ్రతకడానికీ, నలుగురి దగ్గరా పొగడ్తలందు కోవడానికీ అప్పులు చేసి, ఆ అప్పులు, కుటుంబభారమూ కొడుకు మీద వేసి సునాయాసంగా ఈ జీవన రంగంనుంచి నిష్క్రమించాడు.

"వీళ్లబ్బ చాల గొప్పమనిషి. ఇతని పెళ్లి చాల దర్జాగా బ్రహ్మాండంగా జరిపించాడు?" అంటున్నారెవరో పెళ్ళిలో. తండ్రి పోగానే తనను ఎన్ని సమస్యలు చుట్టుముట్టాయో వీళ్లకేం తెలుసు? ఆయనకు ప్రియమైన స్నేహితులే అనేక అప్రియమైన సంగతులు చెప్పారు. ప్రతివాడూ తనకు ఆయన అప్పున్నట్లు లెక్కలు చూపించాడు. తక్షణం అప్పులు తీర్చమనీ, లేదా కోర్టు కెక్కుతామనీ వొత్తిడి చేశారు. ఎవరితో సమంగా హోదాతో గౌరవంగా బ్రతకాలని ఆయన జీవితాంతం ప్రయత్నం చేశాడో, వాళ్లదగ్గరే ఆయన అప్పులు చేశాడంటే తను నమ్మలేక పోయాడు.

అప్పుడు సుందరయ్య భార్య తన నగలన్నీ అమ్మి అప్పులు తీర్చమని భర్తను ప్రోత్సహించింది. ఎంతో భాధతోనే సుందరయ్య ఆ పని చేశాడు. లాండ్ మార్టుగేజ్ బ్యాంకులో భూమి తనఖాపెట్టి కొంత డబ్బు తెచ్చి ఎన్నో అప్పులు తీర్చేశాడు.

ఒకసారి ఊళ్ళో... తండ్రిలాగే... సుందరయ్య కూడా ప్రతిఏడూ సమారాధనా, ఉత్సవమూ జరింపించాలని ... వొప్పించడానికి ఇటువంటి ఉత్సవాలమీద ఆధారపడి బ్రతికే సోమర్లు కొందరు వచ్చారు.

"ఊళ్ళో ఎన్నో పనులు జరగవలసి వున్నాయి. ట్రాక్టర్‌తో ఊటకాలవల కశింతోలడం, ఏరులోకి దిగే మెట్రాళ్ళు రిపేరుచేయడం, వూళ్ళో పడే వాడనీరంతా ఒకచోటికి పోయేట్లు చేయడం, ఆలయం రిపేరు, చెరువుమెరక రిపేరు ...ఏదైనా సరే అందరం కలిస్తే బాగుచేసుకోవచ్చు. ఊళ్ళో బాగా డబ్బున్నవాళ్లు, మంచి భూమీ పుట్రా వున్నవాళ్లు, వ్యాపారస్థులు...

వున్నారు. వాళ్లందరూ ఇటువంటి పనులలో భాగం పంచుకో వాలి. ఒక ఉత్సవమనేది, సమారాధన అనేది గ్రామం అంతటికీ చెందినది. దాన్ని ఊళ్ళో అందరంకలసి జరుపుకొంటేనే ఆనందం. ఆచారం పేరుతో కుటుంబ గౌరవం పేరుతో సంప్రదాయం పేరుతో నన్నొక్కణ్ణే ఇంత బరువుమోసి వంగిపోమనడం బాగు లేదు.'' అన్న సుందరయ్య మాటలు విని వాళ్లు విస్తు పోయారు.

సుందరయ్య తండ్రికూడా ఆఖరు రోజుల్లో డబ్బులేనివాడే అయినా ఇలా ఇంత దారుణంగా దిగజారిపోయి పరువు పోగొట్టు కోలేదని గొణుక్కుంటూ వాళ్లు వెళ్ళిపోయారు.

ఒకసారి సంక్రాంతిపండుగ రోజుల్లో పశువుల పండుగ నాడు ఊళ్ళో ఒకపోట్లాటజరిగింది. పశువులు 'ఊరుచుట్టు'బయలు దేరేముందు అన్నిటికన్న ముందువరసలో సుందరయ్యవాళ్ల ఎద్దులజత వుండటం తరతరాలుగా వస్తున్న ఆచారం. అది ఆ కుటుంబానికి ఒక పెద్దగౌరవం. ఆ ఏడు ఊళ్ళోని కుర్రవాళ్లు ఊళ్ళోని మిగతాపెద్దరైతుల ప్రోత్సాహంతో ఎదురు తిరిగారు. తమ ఎడ్లజత అన్నిజతల కన్న గొప్పగా ఉన్నయ్ గనక వాటికే ముందు నిలుచునే అర్హతవుందని ఒక యువకుడు తన ఎద్దులు ముందుకుతోలుకొనివచ్చాడు. అతణ్ణి సమర్థిస్తూ కొందరు ముందు కొచ్చారు. వాళ్లను బెదిరిస్తూ మరికొందరు ఉరికారు. జుట్లు జుట్లు పట్టుకొన్నారు. తన్నుకొన్నారు. కర్రలూ కత్తులూ తీశారు. అరచి తిట్టుకొన్నారు. చాలమందికి దెబ్బలు తగిలినయ్. నలుగు రైదుగురు ప్రాణాపాయస్థితిలో పడినారు. అప్పుడక్కడ ఉన్న సుందరయ్య తండ్రి తన పక్షంవారిని ప్రోత్సహించడంచేతనే ఇంత

గలభా జరిగింది. తర్వాత ఉళ్లోకి పోలీసులు దిగేరు. కేసునడిచింది. ఈ పోట్లాటకు, వ్యవహారాలకు ఆయన చాలా డబ్బు తగలేశాడు. ఇటువంటి సంఘటనే ఒకసారి సుందరయ్య కాలంలో జరిగింది. అప్పుడొక వర్గం సుందరయ్యను ఉద్రేకపరచడానికి ప్రయత్నం చేసింది. "ఎవరి ఎద్దులు ముందుంటే ఏమి? వాళ్ల ఎద్దులు మంచి పౌరులో వున్నాయి. వాడూ మంచి హుషారులో ఉన్నాడు. వాణ్నే ముందు పోనిద్దాం. ఇందులో కొంపమునిగి పోయేదేముంది. దీనికోసం తలకాయలు పగల కొట్టుకు చస్తామా..." అని సుంద రయ్య ఆ రంగం నుంచి నిష్క్రమించాడు.

మేళతాళాలధ్వనులు తీవ్రమయ్యాయి. పెళ్ళి కొడుకు పెళ్ళికూతురు మెళ్లో తాళికట్టేశాడు. సుందరయ్య ఆనందంతో కళ్ళనుంచి జారే నీటిబిందువుల్ని పై పంచతో తిన్నగా తుడుచు కొన్నాడు. వట్టి పూలమాలలతోనే పెళ్ళి జరిపించేయాలని సుంద రయ్య ఉద్దేశం. అటువంటి పెళ్ళిని గురించి చిత్తూరుకు బెల్లంతోలు కొని వెళ్ళినప్పుడు, అక్కడ మండీలో విన్నాడు. కానీ, ఒక్క సారిగా మరీ తెగిస్తే అవహేళనలు ఎక్కువవుతాయని మామూలు ఆచారాలకు అనుగుణ్యాంగానే పెద్ద ఖర్చులేకుండా జరిపించేస్తు న్నాడు. ఎవరో అందుకొన్నారు...."ఇదంతా ఏముందిగానీ,కరు వులోనయ్యా ఆ మనిషి నిబ్బరాన్ని గురించి చెప్పుకోవలసింది. ఈ యన నేలంతా జాస్తీ పెద్దకాలవక్రిందే కదా వుంది. కరువులో పరుసాగక ఆ కాలవలో నీళ్ళురాలేదు. ఆడికీ కొన్నాళ్ళు దిన్నమూ తెల్లావారీ సాయంకాలమూ ఇసక తీశాడు. కానీ లాభంలేక పోయింది. బావులు సరే. పూడికతీయించూ నువ్వు లోతు త్రవ్వించూ, పాతాళం అంతుకనుక్కో, ఊటమాత్రం ఎక్కువ

రాలేదు. ఆ కాలవ క్రింద వరసగా మూడేళ్ళు వానొచ్చినప్పుడు పైరు నాటడం, మళ్లీ నీళ్లులేక పొట్టకర్రలతో ఎండిపోవడం, అరసాయ కసువు ఎద్దులు తినడం జరిగింది.

ఇంట్లో గాదిలోవున్న గింజలు ఎన్నాళ్ళొస్తాయి. కొన్నాళ్ళకు అవీ అయిపోయాయి. మనమూ కష్టపడ్డాము గింజల్లేక. మనసంగతి వేరు. ఎర్రజొన్నలు వ్యాపారం పెట్టుకొని ఏదోవిధంగా గడిపేశాము. కానీ సుందరయ్య మొదట్నుంచీ భూమిమ్మీద ఆధారపడినవాడు. అల్లాడిపోయాడు. మనబోటి వాళ్ళయితే ఆ సీతారామయ్య కుట్రలో ఇరుక్కొనిపోయి విలవిల లాడిపోయి వుందుము."

ఈ మాటలు స్తంభానికావల కూర్చున్న సుందరయ్యకు వినిపిస్తూనే వున్నయ్. ఆయన కళ్ల ముందొకసారి కరువురోజుల దృశ్యాలు కదిలిపోయాయి. కరువులో ఆ కుటుంబచరిత్రలో మొదటిసారి వడ్లు రాగులు జొన్నలు చింతపండు మిరపకాయలు అన్నీ అయిపోయాయి. అన్నీ కొనవలసిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయం జరగనప్పుడు, డబ్బులుమాత్రం ఎట్లా వస్తాయి?

నిలువవుండిన ఎండుగడ్డి అమ్మి, కొన్నాళ్లు గింజలు కొన్నారు. పశువులకు గడ్డిలేక కొన్నాళ్లు బాగిఆకు వగైరా తిన్నాయి. తర్వాత అదీ దొరకక చిక్కిపోయాయి. బక్కచిక్కిన పశువుల్ని కసాయివాళ్లకు అతి తక్కువ ఖరీదుకు అమ్మి, ఆ డబ్బుతో మనుష్యులు ఆహారం కొనుక్కొనితిని బ్రతికారు. కూలీలు కలబంద గడ్డలు, బూరగ గింజలు, దేవదారు ఆకు, వగైరా తినడం ప్రారంభించారు. గంజిదొడ్లు, కరువుపన్లు ఆధారంగా వాళ్లు కొంత ధైర్యంగావున్నా, మధ్యరకం రైతులు ఏదీ చేయలేక, అల్లాడిపోయారు.

ఆ రోజుల్లో ఒకరోజున సుందరయ్య బావిదగ్గరకు వెళ్లి ఎండిపోతూవున్న చెఱకుతోటను, ఎండిపోయిన మామిడిచెట్లను చూసి విచారంతో తిరిగి ఇంటికొస్తున్నాడు. దారిలో రచ్చ బండమీద కూర్చుని సీతారామయ్య తాపీగా చుట్టకాలుస్తు న్నాడు. సుందరయ్యను చూడగానే ఆప్యాయంతో పలక రించాడు.

"ఏం సుందరన్నా అటూ ఇటూ చూడకుండా నేరుగా పోతున్నావ్! ఇక్కడ చల్లగా వుందిరాబ్బా.... కూర్చో......" అన్నాడు. సుందరయ్య ప్రక్కకుచూశాడు "ఆఁ ఏముందీ! ఈ సారికూడా వానొచ్చేట్లు లేదు..." అని అక్కడే ఆగిపోయాడు. "ఎన్నాళ్లు రాకుండా వుంటుందిలే. అంతా వస్తుందిగానీ రా, కొంచెంసేపు కూర్చోనిపోదువుగానీ...చెఱకుతోటైనా కొంచెం పచ్చగావుందా ... బావిక్రిందైనా ..." అన్నాడు సీతా రామయ్య.

"ఒకచోటనేమిలే? అంతా అట్నేవుంది. మన ప్రక్కూళ్ళో అందరూ బ్రతుకు తెరువుకు మైసూరు ప్రాంతాలకు వెళ్ళి పోతున్నారు. ఈసారి వానలేకపోతే అందరూ పోవలసిందే. ఎట్లా పడివుంటాము? చెఱువులో గొడ్లుత్రాగడానికైనా నీళ్లు లేవు కదా. మీకేం డబ్బున్నవాళ్లు. బావులు ఎంతలోతైనా కొట్టి మిషన్లుపెట్టి నీళ్లుతోడి చెఱకుతోటైనా కాపాడు కొంటు న్నారు..." అన్నాడు సుందరయ్య.

"నువ్వుకూడా గవర్నమెంటు లోన్ తీసుకొని పనిచేయిం చావుకదా, డబ్బుకేం, నన్నడిగితే ఇవ్వనా? నీకు కాకపోతే ఇంకెవరికిస్తాను..." అని సుందరయ్య మొహంలోకి చూశాడు.

సుందరయ్యకూడా ఆయన కళ్లలోకి చూశాడు. ఆ కళ్లలో గర్వము తెలివీ పొర్లుతున్నాయి. అంతా బోధపడింది. సీతారామయ్య ఎత్తులు ఆయన కిదివరకే తెలుసు. ఇది అప్పు ఇచ్చి వడ్డీలు లెక్కకట్టి తిన్నగా పొలాలు...వీలైనంత తక్కువ ధరకు కాజేసే ఎత్తని సుందరయ్యకు స్పష్టంగా బోధపడింది "దానికేంలే. వస్తా..."నంటూ లేచి అక్కణ్ణుంచి ఇంటికొచ్చేశాడు.

వర్షాలొచ్చినయ్ గానీ మొదట ఎద్దులులేక పనిముట్లులేక విత్తులులేక కొన్నాళ్లు బాధపడ్డా, క్రమంగా నిలదొక్కుకోగలిగాడు సుందరయ్య. మేళతాళాల ధ్వనులు తగ్గినై. అతిథులు ఒక్కొక్కరే తాంబూలాలు పుచ్చుకొని వెళ్లిపోతున్నారు. "ఏం బావా పరధాన్యంలో పడినావు. సీతారామయ్యగ్రూపు ఎవరూ వచ్చినట్లు లేదే..." అన్నాడు దగ్గరకొచ్చి బావమరిది.

సుందరయ్య ఉలిక్కిపడి లేచాడు. "రాకపోతే పోన్లే వయ్యా, ఇప్పుడు ముహూర్తానికి రాకపోతే రాత్రికి విందుకు వస్తార్లే......"అని అక్కణ్ణుంచి కదిలాడు. వెనుదిరిగి తను ఇంతవరకు నడచివచ్చిన దారిని చూసుకుంటే ఆ దారిలో ఎందరినో తోడిప్రయాణీకుల్ని వదలుకొన్నానని పించింది సుందరయ్యకు.

ఈ నాడు తనకు ఊళ్ళో పెద్దలలో స్థానంలేదు. తను అనుసరించిన నిరాడంబర పద్ధతుల మూలంగా తనని అందరూ లోకువగా చూశారు. తండ్రి ఎన్ని అప్పులలో మునిగిపోయి వుండినా దర్జాగా డాబుగా జల్సాచేస్తూ బ్రతికినందువల్ల ఆయనకా స్థానం ఉండేది. తన కాస్థానం అక్కర్లేదు.

తనూ ఆ స్థానంకోసం ప్రయత్నించి వుంటే ఈపాటికి...తనపిల్లలు మన్ను మోసి బ్రతకవలసిన స్థితికి వచ్చివుండేవారు. ఈనాడు తను గొప్పవాడు ధనికుడు కాకపోవచ్చు. పూర్వపు ఉన్నతగౌరవం, పేరూ ప్రతిష్ఠా లేకపోవచ్చు. అయినా తనూ తన పిల్లలూ ఎవరి ముందూ తల వొంచవలసిన అవసరంలేదు. ఏ పాపానికీ తాము కారణభూతులైనట్లు ఎక్కడా దాఖలా లేదు.

తన కుటుంబంలో ఎవరూ ఎందుకూ సిగ్గుపడ నక్కర లేదు. పిల్లలు చదువుకొని కష్టపడటం అలవరచుకొని వృద్ధికి వస్తారు. కటాయంగా తను మలచివుంచిన దారి వారికి ఖాయంగా సిద్ధంగా వుంటుంది. వారు తిన్నగా నడిచి గమ్యం చేరు కొంటారు.... అనుకొని తృప్తిగా నిట్టూరుస్తూ ఇంటిముందు భోజనాలు చేస్తున్న కూలీలు స్నేహితుల మధ్యకు వెళ్లాడు. అందర్నీ ఆప్యాయంతో పలకరించి "వీళ్ళే నా బంధువులు, హితులు, ఆత్మీయులు! వీళ్లలోనే నా స్థానం..."అనుకొన్నాడు సుందరయ్య.